MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 287 | పేజీలు : 8 | మంగళవారం 6 అక్టోబర్ 2026 | వెల : 6-00



భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత ఏర్పడింది

- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

5



చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

- న్యాయంలో మానవీయ కోణం కీలకం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- న్యాయవ్యవస్థ పనితీరుపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- చట్టం అందరికీ అర్థమయ్యేలా ఉండాలని, న్యాయంలో కరుణ కీలకం అని స్పష్టం
- ముగ్గురు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమించిన కేంద్రం

ఇంటింటికీ జలధార



- జల్ జీవన్ మిషన్‌తో 3.3 కోట్ల మందికి తాగునీరు
- రూ.30,136 కోట్లతో అమరజీవి జలధార పనులకు శ్రీకారం
- పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభించిన సీఎం, డిప్యూటీ సీఎం
- రాయలసీమ రైజింగ్.. సీమ అభివృద్ధి ఎవరాపినా ఆగదు
- హార్టికల్చర్ హబ్ నుంచి ప్రపంచ మార్కెట్లకు సీమ బ్రాండ్‌తో ఫలాలు
- సీమకు రప్పారప్పా రాజకీయం కాదు.. అభివద్ధి, సంక్షేమం కావాలి
- కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల్లో కూటమి ట్రిపుల్ ఇంజన్ సర్కారే ఉండాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ప్రొద్దుటూరు, మహానగర్

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార పనుల్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. కొత్తపల్లిలో సోమవారం పైలాన్ ఆవిష్కరించిన నేతలు ప్రతి ఇంటికీ కుళాయి, ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేలా చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.30,156 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు 24,601 ఆవాసాలకు నీటి సరఫరాను విస్తరించనున్నారు. ఇందుకోసం 77,243 కిలోమీటర్ల పైపు లైన్ నెట్‌వర్క్ ను విస్తరించేలా పనులు చేపట్టనున్నారు. తద్వారా మొత్తం 61.60 లక్షల కుళాయి - మిగతా2లో

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట



- 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!
- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

విజయవాడ, మహానగర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ - మిగతా3లో

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ



విజయవాడ, మహానగర్

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర - మిగతా3లో

కనకదుర్గమ్మ భక్తుల కోసం 'దసరా-2026' స్మార్ట్ యాప్

- దర్శనం వేళలు, క్యూలైన్ సమయం నుంచి అత్యవసర సేవల వరకు ఒకే వేదికపై సమాచారం
- ప్రత్యేక ఆకర్షణగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత 'దసరా ఏఐ'
- పార్కింగ్, స్నాన ఘాట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య కేంద్రాల వివరాలు
- పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలను ఒక్క క్లిక్‌తో సంప్రదించే సదుపాయం
- గూగుల్ ప్లేస్టోర్‌లో 'దసరా 2026' పేరుతో ఉచితంగా అందుబాటులోకి..
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



అమరావతి, మహానగర్

ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు రూపొందించిన అత్యాధునిక 'దసరా-2026' స్మార్ట్ మొబైల్ యాప్‌ను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోమవారం సాయంత్రం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దర్శనం, ఆలయ సేవలు, భక్తుల సౌకర్యాలు, భద్రత, అత్యవసర వైద్య సహాయం, ఉత్సవాల సమాచారాన్ని ఒకే వేదికపై అందించేందుకు ఆధునిక సాంకేతికతతో యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యాప్‌లో రియల్‌టైమ్ దర్శన సమాచారం, క్యూలైన్‌లో అంచనా - మిగతా2లో

ఇది అస్థిరత యుగం



- కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది'
- ప్రపంచం ఘర్షణలు, టారిఫ్స్ అస్థిరతతో ఫ్లక్స్ యుగంలోకి వెళ్తోందన్న జైశంకర్
- భారత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటుందని ఆశాభావం
- రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గమని చెప్పిన విదేశాంగ మంత్రి

5

ఇంటింటికీ జలధార

-మొదటిపేజీ తరువాయి

కనెక్షన్లకు మరింత మెరుగైన తాగు నీటి సరఫరా జరగనుంది. మొత్తంగా ఈ పనులతో 3.3 కోట్ల మందికి సురక్షితమైన తాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 95 లక్షల కుటుంబాలకు గానూ ఇప్పటికే దాదాపు 62 లక్షల కుటుంబాలకు ఇంటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయని సీఎం తెలిపారు. జల్ జీవన్ మిషన్--2.0 కింద మరో 27 లక్షల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందడం వల్ల ముఖ్యంగా మహిళల నీటి కష్టాలు తీరతాయని చంద్రబాబు పేర్కొన్నారు. నీటి కోసం వెచ్చించే శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయని.. స్వచ్ఛమైన నీటితో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. జల్ జీవన్ మిషన్ ప్రధాన ఉద్దేశం శాశ్వత నీటి వనరుల నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేయడమేనని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో ఈ పథకం అమలులో లోపాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి భారీగా నిధులు పొందిన రాష్ట్రాలతో పోలిస్తే గత ప్రభుత్వం ఏపీలో ఈ పథకానికి కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే వినియోగిం చిందని పేర్కొన్నారు. తాగు నీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. పల్లె పండుగ--3.0 ద్వారా రూ.11,085 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పంట కుంటలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం రానున్న కాలంలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. తాగునీటి అవసరాలతో పాటు సాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా నీటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం ద్వారా తెలుగుతల్లికి జలహారతి ఇచ్చామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో రూ.35 వేలకోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తేదీలతో సహా ప్రాజెక్టుల క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు కరవు సమస్య ఉండదన్నారు. కరవు పరిస్థితుల్లోనూ 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని చెప్పారు. కనీసం 200 టీఎంసీల గోదావరి వరద జలాలను వినియోగించుకుంటే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. హంద్రీ--నీవా ఫేజ్--1ను పూర్తి చేసి రాయలసీమలో రిజర్వాయర్లను నింపామని, వెలిగొండ ఫేజ్--1 ద్వారా నల్లమల సాగర్‌కు నీరు తీసుకెళ్లామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును రానున్న గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. రాయలసీమ దశ, దిశ మార్చేలా రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ హబ్‌తో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, మార్కెటింగ్ సౌకర్యాలు పెరుగుతాయని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ, గోల్డ్ మైనింగ్ వంటి రంగాల్లో ప్రాజెక్టులు రానున్నాయని వెల్లడించారు. సినిమాల్లో ఒకప్పుడు రాయలసీమను ముఠా కక్షలకు ప్రతీకగా చూపించేవారని...ఇకపై శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు మేడ్ ఇన్ రాయలసీమ అని చెప్పుకునే రోజులు వస్తాయన్నారు. ఇక్కడ పండే ఫలాలు ప్రపంచ మార్కెట్లకు రాయలసీమ బ్రాండ్‌తో ఎగుమతి అవుతాయని సీఎం అన్నారు. పేదల సాధికారత, వ్యక్తిగత ఆదాయాల పెంపు, గ్రామాలు--పట్టణాల అభివృద్ధి, నాణ్యమైన జీవితం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు తెలిపారు. 2029 నాటికి ప్రతి కుటుంబానికి ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో 19 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పేదలకు శాశ్వత హక్కులు కల్పించేలా ఇళ్ల పట్టాలు ఇచ్చామని, విశాఖ, విజయవాడ, మంగళగిరిలో 60 వేల మందికి రూ.52 వేల కోట్ల విలువైన ఆస్తులు అందించామని వివరించారు. ప్రతి కుటుంబానికి భరోసా.. ప్రతి వర్గానికి అండ.. ప్రతి ప్రాంతానికి అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వంటి కనీస వసతులు కూడా లేకుండా పోయాయని సీఎం అన్నారు. రోడ్ల విషయంలో నాడు-నేడు బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. పల్లెలకు రహదారుల కల్పనలో పవన్ కల్యాణ్ తనదైన ముద్ర చూపిస్తున్నారని ప్రశంసించారు. 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించామని సీఎం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ల ద్వారా రూ.4,136 కోట్లకు పైగా నిధులు వచ్చాయని చెప్పారు. పంట కుంటలు, గ్రామాలకు రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలతో అభివృద్ధి వేగం పుంజుకుందని వివరించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోనూ ఆ పార్టీకి చెంపదెబ్బ కొట్టారన్నారు. వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిందని, రూ.40 కోట్ల సుపారీ అంశం బయటకు వచ్చిందని అన్నారు. మద్యం కుంభకోణంలో వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. అందులోనూ అంతిమ లబ్ధిదారుగా అన్ని వేళ్లూ గొడ్డలి పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని అన్నారు. దీనికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ... వీటిపై వాస్తవాలు మాట్లాడకుండా ఫేక్ ప్రచారంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు.గ్రూప్ వన్ సర్వీసు పరీక్షలు రాస్తే జవాబు పత్రాలను అటెండర్లు, ఎలక్ట్రీషన్లతో దిద్దించారని.. ఇసుకలోనూ దోపిడీ చేశారు. ఈ అక్రమాలు అన్నిటికీ సమాధానం చెప్పాలని సీఎం సవాలు విసిరారు. నేరాలు ఘోరాలు చేసి ప్రజల్ని మోసం చేయడానికి ఫేక్ ప్రచారం చేస్తారని ఎద్దేవా చేశారు. .గొడ్డలి పార్టీ తోక తిప్పితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓ సిద్ధాంతం అంటూలేని గొడ్డలి పార్టీ కుట్రలు , ఫేక్ ప్రచారమే అజెండా అని సీఎం ఆక్షేపించారు. నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేయటం వారి డీఎన్ఏ లోనే ఉందన్నారు. వివేకా హత్య నుంచి మద్యం కుంభకోణం వరకూ, సింగయ్యను కారుకింద తొక్కించటం నుంచి మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ కేసు తప్పించటం వరకూ అన్నీ దొంగ పనులే చేశారని ఎద్దేవా చేశారు. బలవంతపు మతమార్పిడులు, హిందువులను క్రిష్టియన్లుగా మార్చటం లాంటి చర్యలు చేస్తున్నారని.. ఇలాంటి వన్నీ ఆ పార్టీ సిద్ధాంతంలో భాగమేనని అన్నారు. రాయలసీమలో కనీసం కడపకు ఏం చేశారో చెప్పగలరా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కావాలని కోరడం సరికాదని చంద్రబాబు అన్నారు. ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదని, ప్రజలు ఇచ్చే అధికారమని గుర్తుంచుకోవాలని సూచించారు. 2019లో టీడీపీకి 23 సీట్లు వచ్చినప్పుడు ఐదు సీట్లు లాగేస్తే ప్రతిపక్ష హోదా ఉండదని ఎగతాళి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాను కూడా రాయలసీమ బిడ్డనేనని, ఈ ప్రాంతాన్ని తిరుగులేని అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని.. రాయలసీమకు రప్పారప్పా రాజకీయాలు కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ఉంటే ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉన్నట్టేనని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రం బాగుంటేనే ప్రజలంతా బాగుంటారని చెప్పారు. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అరాచకం వద్దు.. అభివృద్ధి కావాలి. సంక్షోభం వద్దు.. సంక్షేమం కావాలి. రాయలసీమకు శాంతి, నీళ్లు, పరిశ్రమలు, సుపరిపాలన, ఉపాధే కావాలని సీఎం వ్యాఖ్యానించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ప్రజా సంతృప్తినే అధికారుల పనితీరుకు కొలమానం

- అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ
- విజయవాడ డివిజన్, రూరల్ మండలం రెడ్ లిస్ట్‌లో ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి



విజయవాడ, మహానగర్

ప్రజా సమస్యల పరిష్కారంలో కేవలం అర్జీల సంఖ్య తగ్గించడమే కాకుండా, ప్రతి ఫిర్యాదుకు నాణ్యమైన, న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సంతృప్తినే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానంగా తీసుకుని జిల్లాను గ్రీవెన్స్ పరిష్కారంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం తదితర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే నెల రోజుల్లో ముఖ్యమంత్రి ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని, ఇందులో శాఖల వారీగా అధికారుల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ఫిర్యాదులపై స్పందన తదితర అంశాలపై సమగ్ర సమీక్ష జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతికూల నివేదికలు వచ్చే శాఖలు, అధికారులు ముఖ్యమంత్రి సమక్షంలో సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారుల పనితీరును పబ్లిక్ ఫీడ్‌బ్యాక్, రియల్‌టైమ్ గవర్నెన్స్ డేటా, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడం, ఫిర్యాదులపై సరైన స్పందన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరువూరు, విజయవాడ వెస్ట్ జోన్, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సంతృప్తి శాతం తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తక్కువ సంతృప్తి ఉన్న ప్రాంతాల్లో సమస్యలకు కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విజయవాడ డివిజన్, రూరల్ మండలం పీజీఆర్ఎస్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్స్‌లో రెడ్ లిస్ట్‌లో ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీలను సంబంధిత శాఖలకు కేవలం ఎండార్స్ చేసి బాధ్యత ముగిసిందని భావించకూడదని, సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీని పరిశీలించి వాస్తవ సమస్యను గుర్తించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని 14 మండలాల్లో 11 మండలాలు తీవ్ర కరువు పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో రైతులకు అవసరమైన సహాయం అందించడంలో జాప్యం చేయరాదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి ప్రభుత్వ సహాయం, సేవలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉన్నతాధికారులు కార్యాలయాల్లో కూర్చొని నివేదికలను పరిశీలించడం కాకుండా క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల వాస్తవ సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యుత్, వ్యవసాయం, రెవెన్యూ తదితర ముఖ్య శాఖలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పీజీఆర్ఎస్ అర్జీలు, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పబ్లిక్ సాటిస్‌ఫాక్షన్ స్కోర్, రియల్‌టైమ్ గవర్నెన్స్ డేటాను నిరంతరం పరిశీలించి లోపాలను సరిదిద్దుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

కనకదుర్గమ్మ భక్తుల కోసం 'దసరా-2026' స్మార్ట్ యాప్

-మొదటిపేజీ తరువాయి

వేచి ఉండే సమయం, తేదీల వారీగా దర్శన వేళలు, అమ్మవారి నిత్య అలంకారాలు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంటాయి. భక్తులు సమీపంలోని పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలు, కృష్ణా నది స్నాన ఘాట్లు, తాగునీటి పాయింట్లు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, పాదరక్షల భద్రతా కేంద్రాలను మ్యాప్ నావిగేషన్ ద్వారా గుర్తించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలను ఒక్క క్లిక్‌తో సంప్రదించే సదుపాయం కల్పించారు. సమీప పోలీస్ స్టేషన్లు, కమాండ్ కంట్రోల్ రూమ్ వివరాలు కూడా యాప్‌లో పొందుపరిచారు. ప్రత్యేక ఆకర్షణగా 'దసరా ఏఐ' ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చారు. భక్తులు తెలుగు లేదా ఇంగ్లీషులో టెక్స్ట్, వాయిస్ ద్వారా ప్రశ్నలు అడిగి దర్శనాలు, అలంకారాలు, పూజా బుకింగ్‌లు, ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఇంద్రకీలాద్రిపై జరిగే నిత్య పూజలు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను లైవ్ ఛానల్ ద్వారా వీక్షించే సదుపాయం ఉంది. భక్తులు ఫోటో, వాయిస్, లొకేషన్ వివరాలతో ఫిర్యాదులు, అభిప్రాయాలను నమోదు చేయడంతో పాటు తప్పిపోయిన చిన్నారులు, వృద్ధుల సమాచారాన్ని మైక్ ప్రచార కేంద్రానికి పంపవచ్చని తెలిపారు. 'ఇంద్రకీలాద్రి 2026' పేరుతో గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా సేవలు పొందవచ్చని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు, అమరావతి సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

పేదల వైద్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

- సుజనా చౌదరి చొరవతో రూ.31.23 లక్షల ఎల్ఓసీలు

విజయవాడ, మహానగర్



మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలిచింది. ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) పత్రాలను కూటమి నేతలు భవానిపురంలోని ఎన్డీయే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కామకోటినగర్‌కు చెందిన మట్టా వెంకట సత్యవతి (41) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా వైద్య చికిత్స కోసం రూ.8 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. 40వ డివిజన్ కోళ్లఫారం రోడ్డుకు చెందిన కే. విజయరాధిక (48) క్యాన్సర్ చికిత్స కోసం రూ.11 లక్షల విలువైన ఎల్ఓసీ అందుకున్నారు. పూర్ణానందంపేటకు చెందిన పీ. నాగమణి (53) మోచేతి శస్త్రచికిత్స కోసం రూ.3.78 లక్షల విలువైన ఎల్ఓసీని అందుకున్నారు. 47వ డివిజన్‌కు చెందిన డీ. నీరజకు రెండు రోజుల నవజాత శిశువుకు అత్యవసర వైద్యం అందించేందుకు రూ.8.45 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. మొత్తం రూ.31.23 లక్షల విలువైన ఎల్ఓసీలను బాధిత కుటుంబాలకు అందజేశారు. తమ సమస్యలపై త్వరితగతిన స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, కూటమి నేతలు పీవీ చిన్న సుబ్బయ్య, పచ్చిపులుసు వెంకట శివప్రసాద్, మన్నం నారాయణ, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కానిస్టేబుళ్లదే కీలక పాత్ర

పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు





విజయవాడ క్రైమ్, మహానగర్

శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజారోగ్య రక్షణలో పోలీస్ కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు అన్నారు. 2025లో జరిగిన పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో అర్హత సాధించి ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు ఎంపికైన 227 మంది కానిస్టేబుళ్లు తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన నేపథ్యంలో పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో వారితో కమిషనర్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగం కేవలం ఉద్యోగం కాదని, బాధ్యతాయుతమైన ప్రజాసేవ అని అన్నారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై ఉండే నమ్మకం, గౌరవం క్షేత్రస్థాయిలో పనిచేసే కానిస్టేబుళ్ల ప్రవర్తనపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. విధుల్లో సమయపాలన, నిబద్ధతతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, మహిళలు, వయోవృద్ధులతో మర్యాదగా, సానుభూతితో వ్యవహరించి వారి సమస్యలను ఓర్పుగా వినాలని అన్నారు. ఆధునిక సైబర్ నేరాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వృత్తిపరమైన ఒత్తిళ్లను అధిగమించేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన నూతన కానిస్టేబుళ్లను, వారి కుటుంబ సభ్యులను అభినందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ షిరిన్ బేగం, అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత, ఏఆర్ డీసీపీ సత్యనారాయణ, ఏఆర్ ఏడీసీపీ రమణ, ఏసీపీ కృష్ణంరాజు, ఆర్ఐలు, నూతన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పంట సంరక్షణ రంగంలో గ్లోబల్ లీడర్‌గా కోర్టెవా

విజయవాడ

అధునాతన విత్తన, జన్యుపరమైన వ్యాపార విభజనను విజయవంతంగా పూర్తి చేసిన కోర్టెవా, ఇకపై ప్రపంచస్థాయి పంట సంరక్షణ సంస్థగా ముందుకు సాగనున్నట్లు ప్రకటించింది. రాబోయే దశాబ్దంలో 5 జీవ ఉత్పత్తులతో పాటు 12 కొత్త క్రియాశీలక రసాయనాలను మార్కెట్‌లోకి తీసుకురావడానికి సంస్థ సిద్ధమవుతోంది. కోర్టెవా సీఈఓ ల్యూక్ కిస్సామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అత్యుత్తమ బృందం, బలమైన ఉత్పత్తి శ్రేణి, ఆవిష్కరణల సామర్థ్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతులు, ఛానల్ భాగస్వాములు, వాటాదారులకు సురక్షితమైన, సమర్థవంతమైన, స్థిరమైన పరిష్కారాలను అందించడమే లక్ష్యమన్నారు. 2020--2025 మధ్యకాలంలో కోర్టెవా పంట సంరక్షణ వ్యాపారం ఆదాయాన్ని 1 బిలియన్ డాలర్లకు పైగా పెంచుకోగా, సెగ్మెంట్ ఆధారిత నిర్వహణ జుదీఃఖణా మార్జిన్లను సుమారు 250 బేసిస్ పాయింట్లు విస్తరించింది. బయోలాజికల్స్, సహజ ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టితో ఉత్పత్తి శ్రేణిని విభిన్న సాంకేతికతల వైపు అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ఈ విభిన్న ఉత్పత్తులు మొత్తం అమ్మకాలలో సుమారు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 11 బిలియన్ డాలర్ల పంట సంరక్షణ ఉత్పత్తుల శ్రేణి, ప్రపంచస్థాయి పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలతో భవిష్యత్ వృద్ధిని కొనసాగించనున్న కోర్టెవాలో సుమారు 9,000 మంది ఉద్యోగులు 110 దేశాల్లో రైతులకు సేవలందిస్తున్నారు.

సరికొత్త బ్రాండ్ ఐడెంటిటీని ఆవిష్కరించిన ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్

విజయవాడ:

ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్) సరికొత్త బ్రాండ్ ఐడెంటిటీతో పాటు 'హర్ కల్ ఆసాన్' అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను ఆవిష్కరించింది. భారతీయ కస్టమర్లకు జీవిత బీమాను మరింత సరళంగా, పారదర్శకంగా, సులభతరంగా అందించాలనే సంస్థ నిబద్ధతను కొత్త బ్రాండ్ ఐడెంటిటీ ప్రతిబింబిస్తుందని సంస్థ తెలిపింది. గత 25 ఏళ్లుగా 20 కోట్ల మందికి పైగా భారతీయుల కలలు, భవిష్యత్తుకు భద్రత కల్పించడంలో భాగస్వామిగా ఉన్నామని పేర్కొంది. మారుతున్న కెరీర్ అవకాశాలు, కుటుంబ స్వరూపాలు, పెరుగుతున్న ఆయుర్దాయం, మారుతున్న ఆర్థిక ప్రాధాన్యతల నేపథ్యంలో దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని తెలిపింది. ఈ అనిశ్చితులను అధిగమించడంలో జీవిత బీమా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది. భవిష్యత్తు కోసం ప్రణాళికలను సంక్లిష్టంగా కాకుండా స్పష్టత, ఆత్మవిశ్వాసం, నిశ్చింతను అందించే విధంగా మార్చడమే తమ లక్ష్యమని ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఆఫ్ మార్కెటింగ్ (డిజిటల్ ఓ బ్యాంకెష్యూరెన్స్) శ్రీనివాస్ బాలసుబ్రమణియన్ తెలిపారు. '2047 నాటికి అందరికీ బీమా' లక్ష్య సాధనకు సంస్థ క్రియాశీలకంగా సహకరిస్తుందని చెప్పారు.

కడపలో అమెజాన్ నౌ సేవలు ప్రారంభం

కడప

అమెజాన్ తన 'డెలివరీ-ఇన్-మినిట్స్' సేవ అమెజాన్ నౌను కడపలో ప్రారంభించింది. నగరంలోని వినియోగదారులు కిరాణా సరుకులు, పండ్లు, కూరగాయలు, పాలు, బ్రెడ్, వంట నూనె, నెయ్యి, టీ, నూడుల్స్, ఫ్రోజెన్ ఫుడ్, వ్యక్తిగత సంరక్షణ, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ అండ్ కిచెన్, చిన్న గృహోపకరణాలు తదితర పదుల వేల ఉత్పత్తులను నిమిషాల్లోనే పొందవచ్చని సంస్థ తెలిపింది. కడపలో రోజువారీ నిత్యావసరాలతో పాటు ఆర్గానిక్ ఉత్పత్తులు, ప్రీమియం చాక్లెట్లు, గృహ సంరక్షణ ఉత్పత్తులకు కూడా డిమాండ్ ఉందని వెల్లడించింది. అమెజాన్ నౌ సేవలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని, వార్షిక స్థూల విక్రయాలు 1 బిలియన్ డాలర్లను దాటాయని సంస్థ తెలిపింది. దీపావళి నాటికి 100 నగరాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ప్రస్తుతం 60కి పైగా నగరాలు, పట్టణాల్లో సేవలు అందుబాటులో ఉండగా, 750కి పైగా మైక్రో, అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల ద్వారా ఆర్డర్లను వేగంగా చేరవేస్తోంది. అక్టోబర్ 8 నుంచి ప్రారంభమయ్యే అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో అమెజాన్ నౌపై ప్రత్యేక డీల్స్ అందుబాటులో ఉంటాయని తెలిపింది. యాడీx క్రెడిట్, డెబిట్ కార్డులు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం తక్షణ డిస్కౌంట్ లభిస్తుందని వెల్లడించింది.

విద్యుత్ శాఖ ఏఈగా నాగేశ్వరరావు

ఆగిరిపల్లి, మహానగర్



ఏపీఎస్పీడీసీఎల్ (విద్యుత్ శాఖ) అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా సిహెచ్. నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జూనియర్ ఇంజినీర్ రజిని ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నందిగామ ఏఈగా పనిచేస్తున్న తనను ఆగిరిపల్లికి బదిలీ చేశారని నాగేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి పరిధిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటలూ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. వినియోగదారులు, రైతులకు అందుబాటులో ఉంటూ, తన పరిధిలోని లైన్‌మెన్ల సహకారంతో విద్యుత్ సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు



ఆగిరిపల్లి, మహానగర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత తెలిపారు. అండర్--14 హ్యాండ్‌బాల్ బాలుర, బాలికల విభాగాల్లో కె.లిఖేష్, ఎన్.నందిని, ఎస్‌కె.జోయా అన్వర్, అండర్--14 యోగా బాలికల విభాగంలో ఆర్‌పి.నీలం కుమారి, అండర్--16 బాలుర కబడ్డీ విభాగంలో సాయి, అండర్--19 బాలుర కబడ్డీ విభాగంలో టి.అక్షయ్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.శివ నాగేంద్రరావు, ఎన్.సుగుణరావు, బి.సాయి కిషోర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పెద్దలు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి ఆగిరిపల్లి మండలానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహనకు షార్ట్‌ఫిల్మ్

విజయవాడ క్రైమ్, మహానగర్



డ్రగ్స్ వినియోగం వల్ల యువత, కుటుంబాలు, సమాజంపై కలుగుతున్న తీవ్ర ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన సామాజిక అవగాహన డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్ ట్రైలర్‌ను జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు ఆవిష్కరించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం, విద్యార్థుల్లో డ్రగ్స్‌పై అవగాహన పెంచడం, డ్రగ్స్ నిర్మూలనకు ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్ చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలనే ఉద్దేశంతో ఈ లఘుచిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు షేక్ సోను తెలిపారు. సమాజంలో డ్రగ్స్ వినియోగం కారణంగా చోటుచేసుకుంటున్న వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రంలో డ్రగ్స్‌కు అలవాటుపడితే వ్యక్తి జీవితంతో పాటు కుటుంబం, సంబంధాలు, ఆశయాలు, భవిష్యత్తుపై పడే తీవ్ర ప్రభావాలను చూపించినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ "డ్రగ్స్‌ను అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యత కాదు.. సమాజం మొత్తం బాధ్యత" అనే సందేశంతో అవగాహన లఘుచిత్రాన్ని రూపొందించిన చిత్రబృందాన్ని అభినందించారు. యువతలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ఈ చిత్రాన్ని విద్యార్థులకు ప్రదర్శించేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత, లఘుచిత్ర దర్శకుడు షేక్ సోను తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి రూ.5 వేల ఆర్థిక సాయం



గూడూరు, మహానగర్

మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన కొత్త నాగ వెంకట అనిల్ కుమార్ మచిలీపట్నంలోని వైజేఆర్‌డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఐసీ (ఏఐ, డీఎస్) చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లి సంపాదించే ఆదాయంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కళాశాల దూరంగా ఉండటంతో రోజూ వెళ్లి రావడానికి అయ్యే ప్రయాణ ఖర్చులు కూడా ఆర్థికంగా ఇబ్బందిగా మారాయి. ఈ విషయాన్ని విద్యార్థి తాత చిదంబరరావు శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవికి వివరించారు. దీంతో విద్యార్థి చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కలగకుండా ప్రయాణ ఖర్చుల కోసం కప్పలదొడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో పేరిశెట్టి నాగరవి రూ.5 వేల నగదును అనిల్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన అనంతరం సమాజానికి తన వంతు సేవ చేయాలని నాగరవి ఆకాంక్షించారు. విద్యార్థిని ప్రోత్సహించి చదువుకు అండగా నిలిచిన నాగరవికి తాత చిదంబరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బూసం సాయిబాబు, బళ్ళ నాగేశ్వరరావు, అనిల్, చిదంబరం తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ నెల 7, 8 తేదీల్లో మహిళల చెస్ ఛాంపియన్‌షిప్.. యూనివర్సిటీ జట్టు ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళల చెస్ ఛాంపియన్‌షిప్--2025-26తో పాటు యూనివర్సిటీ మహిళల చెస్ జట్టు ఎంపికలు ఈ నెల 7, 8 తేదీల్లో గవర్నర్‌పేటలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆర్. రఘురామ్ తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు 2026-27 క్యాలెండర్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 7న ఉదయం 8 గంటలకు టీమ్ మేనేజర్ లేదా ఫిజికల్ డైరెక్టర్, సంబంధిత లెక్చరర్‌తో కలిసి నిర్వాహక కార్యదర్శికి హాజరుకావాలని సూచించారు. ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు అదే రోజు సాయంత్రం 3 గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. యూజీ విద్యార్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ పాస్ సర్టిఫికెట్లలో జన్మతేదీ వివరాలు, ఆధార్, అపార్ ఐడీ జిరాక్స్ ప్రతులను కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన అర్హత ఫారాలతో పాటు సమర్పించాలి. పీజీ విద్యార్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పాస్ సర్టిఫికెట్ల ధ్రువీకరించిన ప్రతులను అర్హత ఫారాలతో సమర్పించాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

గల్లీ ల్యాబ్స్ లిమిటెడ్ ఎడిషన్ స్నీకర్‌ను ఆవిష్కరించిన రాయల్ ఛాలెంజ్

విజయవాడ



స్వదేశీ స్ట్రీట్‌వేర్ లేబుల్ గల్లీ ల్యాబ్స్ రూపొందించిన లిమిటెడ్ ఎడిషన్ స్నీకర్‌ను రాయల్ ఛాలెంజ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఆవిష్కరించింది. 'చూజ్ బోల్డ్' అనే తత్వాన్ని స్ట్రీట్‌వేర్ సంస్కృతితో అనుసంధానిస్తూ ఈ ప్రత్యేక సహకారాన్ని రూపొందించింది. రాయల్ ఛాలెంజ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నిర్భయ స్వీయ వ్యక్తీకరణ స్ఫూర్తిని, గల్లీ ల్యాబ్స్ స్ట్రీట్‌ఫస్ట్ డిజైన్ శైలితో మేళవించి ఈ స్నీకర్‌ను రూపొందించారు. ధరించే వ్యక్తి అడుగు పెట్టకముందే అతడి వ్యక్తిత్వాన్ని, ధైర్యమైన వైఖరిని ప్రతిబింబించేలా దీని డిజైన్‌ను తీర్చిదిద్దారు. డియాజియో ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఆనందిత దత్తా, గల్లీ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు అర్జున్ సింగ్ ఈ సహకారంపై ఆనందం వ్యక్తం చేశారు. నటులు వరుణ్ సూద్, కరణ్ టాకర్ తమదైన శైలిలో ఈ సహకారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరుణ్ తన అథ్లెటిక్, సాహసోపేతమైన వ్యక్తిత్వంతో, అంచనాలకు మించి తనను తాను ముందుకు నడిపించే వైఖరితో 'చూజ్ బోల్డ్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుండగా, కరణ్ తన అప్రయత్నమైన వ్యక్తిగత శైలి, స్నీకర్లపై ఉన్న ఆసక్తితో ఈ భాగస్వామ్యానికి మరింత ఆకర్షణ తీసుకొస్తున్నారు. వీధి సంస్కృతి, వ్యక్తిత్వం, స్వతంత్రంగా తమ మార్గాన్ని ఎంచుకునే ఆత్మవిశ్వాసాన్ని ఈ లిమిటెడ్ ఎడిషన్ స్నీకర్ ప్రతిబింబిస్తుందని సంస్థలు పేర్కొన్నాయి.

హిమాలయ బేబీకేర్ గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్ పోటీ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, మహానగర్



హిమాలయ బేబీకేర్ నిర్వహించిన 'గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్' పోటీలో దేశవ్యాప్తంగా 12 మంది విజేతలను ప్రకటించారు. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాల నుంచి విజేతలను ఎంపిక చేశారు. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.లక్ష విలువైన బంగారం, మరో ఎనిమిది మందికి రూ.10 వేల విలువైన వెండి బహుమతులు అందించనున్నారు. బహుమతులను టనిష్క్ లేదా కళ్యాణ్ బంగారు నాణేల రూపంలో పొందే అవకాశం ఉంది. తల్లిదండ్రులు తమ చిన్నారులతో పంచుకునే మధుర జ్ఞాపకాలను జరుపుకునే ఉద్దేశంతో ఈ పోటీని నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్‌లోని సంకేత చిత్రాన్ని స్కాన్ చేసి, చిన్నారితో ఉన్న మధుర జ్ఞాపకాన్ని పంపాల్సి ఉంటుంది. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రూ.500 విలువైన 'మై బేబీ అండ్ మీ' డిజిటల్ పుస్తకాన్ని ఉచితంగా అందించారు. విజేతలుగా వినోతిని లియో, సుశ్రీ సంగీత బెరువా, జయంతి దేవి, డేవిడ్ రాజ్ దేవరకొండ, సర్ఫరాజ్ అహ్మద్ తదితరులను ప్రకటించారు. కుటుంబాలతో మరింత సన్నిహిత అనుబంధాన్ని పెంపొందించేందుకు భవిష్యత్తులోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని హిమాలయ వెల్‌నెస్ బేబీకేర్ విభాగం డైరెక్టర్ చక్రవర్తి ఎన్.వి. తెలిపారు.

మహానగర్

వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

బీజేపీ బూచి రాజకీయాలకు ముగింపు



తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ దేశ రాజకీయాలకు భిన్నమైన వైఖరితో నడుస్తుంటాయి. ద్రవిడ భావజాలం, స్వయంప్రతిపత్తి నినాదాలతో దశాబ్దాలుగా కేంద్రంలోని బీజేపీని బద్ధ శత్రువుగా చిత్రీకరిస్తూ నడిచిన తమిళ రాజకీయం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకప్పుడు బీజేపీని , కాషాయ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భావజాలం కనుమరుగై, అన్ని ప్రధాన శక్తులూ కేంద్రంతో ఘర్షణను పక్కనపెట్టి వ్యూహాత్మక సర్దుబాట్ల వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రధాన పార్టీ కూడా ఇప్పుడు బీజేపీపై బాహాటంగా యుద్ధం ప్రకటించే స్థితిలో లేకపోవడం సరికొత్త రాజకీయ వాస్తవికతను ఆవిష్కరిస్తోంది.ఒకవైపు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే మళ్లీ అధికారికంగా ఎన్డీయే గూటికి చేరి బీజేపీతో పొత్తును కొనసాగిస్తుండగా.. అధికారం కోల్పోయిన ద్రవిడ మున్నేట్ర కళగం వైఖరిలో వచ్చిన విస్మయకర మార్పు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఓటమి ఎదురైన వెంటనే కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకుని దూరంగా జరిగిన డీఎంకే.. ఇప్పుడు బీజేపీపై ఒక్క విమర్శ కూడా చేయకుండా పూర్తిగా మౌనముద్ర దాల్చింది. సనాతన ధర్మం, హిందీ వ్యతిరేకత, కేంద్ర నిధుల వివక్ష అంటూ గతంలో రోజూ విరుచుకుపడే ఉదయనిధి స్టాలిన్ వంటి దూకుడు నేతలు సైతం ఇప్పుడు కేంద్రంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయకుండా నోరు కట్టేసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల భయం, ద్రవిడ ఓటు బ్యాంకులో మార్పులు డీఎంకేను బీజేపీపై సైలెంట్ అయ్యేలా ఒత్తిడి చేశాయన్నది బహిరంగ రహస్యం.మరోవైపు నూతన రాజకీయ శక్తిగా అవతరించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తలపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే తీరు మరింత ఆసక్తికరంగా ఉంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల మద్దతుతో సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ పేరిట సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పటికీ.. విజయ్ జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కూటమి ప్రాబల్యంలోకి వెళ్లలేదు. ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి కేంద్ర ఎన్నికల సంఘంపై సాగిస్తున్న సేవ్ డెమోక్రసీ ఉద్యమానికి గానీ, ఈవీఎంల వ్యతిరేక ప్రచారాలకు గానీ విజయ్ ప్రభుత్వం ఎలాంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. కాంగ్రెస్‌ను తన కూటమిలో ఒక భాగస్వామిగా మాత్రమే ఉంచుకుంటూ.. ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో ఎటువంటి ఘర్షణాత్మక వైఖరి లేకుండా సమదూర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.గతంలో తమిళనాడు ఎన్నికల్లో బలంగా పనిచేసిన యాంటీ-బీజేపీ సెంటిమెంట్ ఇప్పుడు తన పదును పూర్తిగా కోల్పోయింది. అన్నాడీఎంకే పొత్తుతో ఉండగా, అధికారం కోల్పోయిన డీఎంకే రాజీ ధోరణిలోకి వెళ్లిపోయింది. అటు కొత్తగా అధికారంలోకి వచ్చిన విజయ్ టీవీకే కేంద్రంతో ఘర్షణ పడే సాహసం చేయడం లేదు. ఈసీ వ్యవహారాలు, కేంద్ర విధానాలపై తమిళనాడు పార్టీలు గళం విప్పకపోవడం.. ద్రవిడ ఉద్యమ పునాదుల్లో సిద్ధాంతాల కంటే అధికార మనుగడ, లబ్ధి మాత్రమే మిగిలాయని నిరూపిస్తోంది. ఒకప్పుడు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్న బీజేపీ.. నేడు తమిళనాట తన వ్యతిరేకతను పూర్తిగా పలుచన చేసి, రాష్ట్ర రాజకీయాలను తన నియంత్రణలోకి తెచ్చుకోవడంలో తెరవెనుక వ్యూహాత్మక విజయం సాధించిందని అనుకోవచ్చు.

సాధారణంలో అసాధారణం..

కళాత్మకతలో కొత్త కోణం

ఈ పుస్తకం నిత్యజీవితంలోని వస్తువులు, పరిసరాలు, దైనందిన అనుభవాల్లో దాగివున్న అందాన్ని లోతుగా చర్చిస్తుంది. కళలు, ప్రకృతితో పాటు మనం రోజూ ఎదుర్కొనే సాధారణ జీవితానుభవాలకూ సౌందర్యశాస్త్రంలో తగిన చోటు ఉండాలని థామస్ లెడ్డి వాదిస్తారు. ముఖ్యంగా నిత్యం మనం పలికే 'అమ్మ' (చక్కదనం), 'ఎవంఎ' (గజిబిజి), 'జూతీవ్ఎ' (ముచ్చటైన రూపం), 'శ్రీశీజవశ్రీఎ' (మనోహరత), 'ఛిబ్వ' (ముద్దులొలికే తీరు), 'జూశ్రీమ్ఖయిత్' (ఆహ్లాదం) వంటి మాటలను కూడా సౌందర్య భావనలుగా విశ్లేషించడం ఆయన ఆలోచనల ప్రత్యేకత.

సౌందర్యం అంటే ఏంది?

అద్భుతమైన ప్రకృతి దృశ్యాన్ని చూసి పొందే పరవశమా? ఏదైనా అసాధారణ కళారూపం మనపై చూపే బలమైన ప్రభావమా? లేక ఒక గొప్ప చిత్రాన్ని చూసినప్పుడు కలిగే అనుభూతినా? సౌందర్యశాస్త్ర చర్చల్లో చాలాకాలంపాటు ఈ ప్రశ్నలు కళల చుట్టూ, ప్రకృతి వైభవం చుట్టూ, అరుదైన అనుభవాల చుట్టూనే తిరిగాయి. కానీ మనిషి జీవితం ఎప్పుడూ ఇలాంటి గొప్ప క్షణాలతోనే గడవదు. నిత్యం ఎదురయ్యే సాధారణ వస్తువులు, అలవాటైన పనులు, పరిచయమైన పరిసరాలు, చిన్నచిన్న ఎంపికలతోనే మన బతుకు సాగుతుంది. మరి ఈ సాదాసీదా జీవితంలో సౌందర్యం ఉండదా? ఉంటే అది ఎక్కడ, ఏ రూపంలో కనిపిస్తుంది? థామస్ లెడ్డి రాసిన పుస్తకం లేవనెత్తే ముఖ్యమైన ప్రశ్న ఇదే.

ఈ నేపథ్యంలో 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనే మాటను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇది థామస్ లెడ్డి తన సిద్ధాంతానికి పెట్టిన పేరు కాదు. ఆయన సూక్ష్మ సౌందర్యానుభవం అతిసూక్ష్మ సౌందర్యానుభవం సూక్ష్మ సౌందర్య ప్రభావం వంటి మాటలతో చిన్నచిన్న సౌందర్య సందర్భాలను వివరిస్తారు. అలాగే సౌందర్య పూర్వదశ సౌందర్యానుభవ ఆరంభ రూపం వంటి స్థితులనూ చర్చిస్తారు. అందువల్ల 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనేది నిత్యజీవిత సౌందర్యంపై ఆయన ఆలోచనలన్నింటినీ కలిపి అర్థం చేసుకోవడానికి వాడే ఒక సులువైన మాట మాత్రమే.

ఇక్కడ 'సూక్ష్మ' అంటే సౌందర్యం విలువ తక్కువని కాదు, అనుభవపు తీవ్రత తక్కువని, పరిధి చిన్నదని, సందర్భం చాలా సాధారణమైనదని అర్థం. రోజూ వేసుకునే బట్టలు ఎంచుకునేటప్పుడు వాటి రంగు, తీరు, పొందిక మనకు నచ్చవచ్చు. అక్కడ పెద్ద పారవశ్యం ఏమీ కలుగకపోవచ్చు, అయినా ఆ బట్టల తీరు మన కండ్లను ఆకట్టుకుంటుంది. వస్తువు ఉపయోగం కంటే దాని రూపురేఖలే మనకు నచ్చిన ఆ క్షణంలోనే ఒక చిన్న సౌందర్యానుభవం మొదలవుతుంది. ఈ అనుభవానికి శ్రద్ధ అవసరం. మన చుట్టూ ఎన్నో వస్తువులు ఉంటాయి. రోజూ చూసే అలవాటు వల్ల, వాటి పనేంటో మనకు తెలుసునన్న ధీమాతో వాటి రూపాన్ని ప్రత్యేకంగా గమనించం. కానీ కాస్త మనసు పెట్టి చూస్తే పరిస్థితి మారిపోతుంది. వాటి రంగు, తీరు, అమరిక, పరిసరాల ప్రత్యేకత స్పష్టంగా కండ్ల ముందు నిలుస్తాయి. ఇక్కడ వస్తువులో ఏ మార్పూ ఉండదు, మారేది మన చూపు మాత్రమే. ఆ మారిన చూపులోనే సౌందర్యం దాగివున్నది.

ఇలాంటి నిత్యజీవిత తాత్విక చూపు దాసరి అమరేంద్ర యాత్రా రచనలైన 'అండమాన్ డైరీ' (2016), 'గల్ఫ్ గీతం' (2021)లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉరుకుల పరుగుల జీవితంలో సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని ఆస్వాదించే తీరిక కరువవుతున్నదని 'అండమాన్ డైరీ'లో రచయిత బాధపడతారు. వెన్నెల కాంతిని చూసి ఆనందించే తీరికా ఉండదు. కండ్ల ముందు ఎన్నో అందమైన దృశ్యాలు కదలిపోతున్నా, ఆగి చూసే శ్రద్ధ, స్పందించే మనసు లోపిస్తున్నాయి. ఈ ఆవేదనలో ప్రకృతిపై ప్రేమే కాకుండా, ఆధునిక మనిషిలో సన్నగిల్లుతున్న పరిశీలనా దృష్టి గురించిన ఆలోచన కూడా కనిపిస్తుంది. రచయిత ఆ శ్రద్ధను తన రచనలో నిలబెట్టుకుంటూ, పెద్ద దృశ్యాలకే కాకుండా చిన్న విషయాలకూ విలువనిస్తారు. రచనలో ఒక పోలీసు.. యువతి తనను స్థానిక ద్వీపవాసిగా పొరబడిన చిన్న సంగతిని ఆయన ఎంతో సరదాగా గుర్తుచేసుకుంటారు. 'అంతకన్నా గొప్ప యోగ్యతా పత్రం చలం గారు కూడా ఇవ్వలేరు!' అనే మాటతో ఆ చిన్న సన్నివేశానికి కొత్త అందం వస్తుంది. ఇక్కడ సౌందర్యం ప్రకృతిలో కాదు, అది మనుషుల మాటల్లో, ఆత్మీయ జ్ఞాపకాల్లో, సున్నిత హాస్యంలో మెరుస్తుంది.

బ్రిటిష్ వృద్ధురాలిని కలిసిన సందర్భంలో ఈ చూపు మరింత విచ్చుకుంటుంది. ఆమె రూపం, మాటలు, రచయిత జవాబు, ఆ తర్వాత సంధ్యావేళ ఆకాశంలో విరిసిన రంగుల సొగసు కలిసి ఒక అందమైన దృశ్యంగా మారతాయి. సూర్యాస్తమయం తర్వాత మిగిలిన రంగులను రచయిత ఒక పాత జ్ఞాపకంతో ముడివేస్తారు. దృశ్యం అక్కడితో ఆగక జ్ఞాపకమై, ఊహతో కలిసి, ఒక సాధారణ క్షణాన్ని గొప్ప అనుభూతిగా మలుస్తుంది.

ఓడ ప్రయాణాన్ని వర్ణించేటప్పుడు కూడా ఇలాంటి చిన్న సౌందర్యమే కనిపిస్తుంది. బయలుదేరాల్సిన సమయం దగ్గరపడినా ఓడ ఇంకా 'నిద్రలేచే లక్షణాలే' చూపలేదని రచయిత రాస్తారు. ఓడ కదలకుండా ఉండటం సాధారణ విషయమే అయినా, దాన్ని ఇంకా మేల్కొనని మనిషిలా ఊహించడంతో ఆ మాటలకు ప్రాణం వస్తుంది. మామూలు సమాచారం ఒక చక్కని రూపకంగా మారి పాఠకుడి మనసులో నిలుస్తుంది. నిత్య జీవిత వాస్తవం సాహిత్యంలో కొత్త సొగసును సంతరించుకుంటుంది. ఇదే దృష్టి 'గల్ఫ్ గీతం'లో మరో తీరుగా దర్శనమిస్తుంది. పుస్తక పరిచయంలోనే ప్రయాణాన్ని కేవలం ఊళ్లు చూడటంగా కాకుండా, కొత్త అనుభవాలను పొందే సాధనంగా భావించాలనే ఆలోచన కనిపిస్తుంది. 'ప్రతి ప్రయాణమూ ఒక పాఠం, ప్రతి మనిషీ ఒక నడిచే పుస్తకం, ప్రతి అనుభవమూ ఆ పుస్తకంలో ఒక అధ్యాయం' అనే మాటలు యాత్రకు మంచి లోతును ఇస్తాయి. ఈ పుస్తకంలో ఆయన నగరాల పైపై మెరుగులనే కాకుండా, దారిపొడవునా కనిపించే చిన్న చిన్న విషయాలను కూడా ఎంతో ఆసక్తితో చూస్తారు. ఎడారి ఒడిలోని నీటి చెలమలు, పచ్చదనం, చెట్ల నీడన సాగే నడక దారులు, అక్కడి ఆహ్లాదం, ఆ నిర్మాణాల చక్కదనం ఆయన రాతల్లో ప్రాణం పోసుకుంటాయి. ఇక్కడ ప్రయాణ వివరాల కంటే, ఆ దృశ్యం రచయిత మనసులో కలిగించిన స్పందనే మనకు నచ్చుతుంది. మనుషులను పరిచయం చేయడంలోనూ ఇదే శ్రద్ధ కనిపిస్తుంది. ప్రయాణంలో కలిసిన వ్యక్తులను రచయిత చూసీచూడనట్లు వదిలేయరు. వారి మాటలను, స్వభావాలను, జీవన నేపథ్యాలను గుర్తుపెట్టుకుని రాస్తూ, ఆ పరిచయాలను విలువైన సాహిత్య జ్ఞాపకాలుగా మలుస్తారు. ఈ తాత్విక దృష్టి కేవలం పుస్తకాల విశ్లేషణకో, సాహిత్య చర్చలకో మాత్రమే పరిమితమైనది కాదు, ఆధునిక ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన కళ.

మళ్లీ బ్యాలెట్లతో ఎన్నికలకు ఖర్గే డిమాండ్

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశవ్యాప్తంగా జరిగిన లోక్‌సభ , అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తిగా అక్రమమని, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా దేశంలోని ముఖ్యమంత్రులంతా అక్రమ ప్రక్రియ ద్వారానే పదవుల్లోకి వచ్చారని ఆరోపణలు చేశారు. ప్రస్తుత లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేసి, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో సరికొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ ఎన్నికల ప్రక్రియను ఇంత తీవ్రంగా కించపరిచే ప్రకటన దేశంలోని అత్యంత పురాతన జాతీయ పార్టీ అధ్యక్షుడి స్థాయి నుంచి రావడం విడ్డూరంగా మారింది.ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వచ్చినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందని, పరాజయం ఎదురైనప్పుడు వ్యవస్థలన్నీ మేనేజ్ అయిపోయాయని నిందించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్న విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే ఈసారి ఖర్గే ఏకంగా దేశంలోని యావత్ ఎన్నికల ప్రక్రియనే చట్టవిరుద్ధం అని ప్రకటించడంతో, పరోక్షంగా భారత రాజ్యాంగం, దేశ ప్రజల తీర్పునే ఆయన అవమానించినట్లయింది. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితాల సవరణ అంటూ సాకులు వెతుకుతూ, క్షేత్రస్థాయిలో వరుస ఓటములకు ఎన్నికల సంఘంపై నెపం నెట్టే ప్రయత్నం కాంగ్రెస్ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. ఖర్గే చెప్పినట్లు దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే అయితే, ఆ వ్యవస్థ ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు కూడా అక్రమమే కావాలి. మరి అదే నిజమైతే, కాంగ్రెస్ పార్టీ తన వాదనల్లో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే చేతల్లో చూపించాల్సిన అవసరం ఉంది.కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికైంది ఇదే ఈవీఎంల ద్వారా, ఇదే ఎన్నికల సంఘం పర్యవేక్షణలోనే. మరి ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు కూడా అక్రమమైనవేనా అన్న ప్రశ్నకు ఆ పార్టీ నేతలు ఏం సమాధానం చెబుతారు? కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యంపై, దేశ ప్రజల ముందు తమ వైఖరిపై నిజాయితీ ఉంటే.. ఇతరుల రాజీనామాలను డిమాండ్ చేయడానికి ముందుగా తాము పాలించే రాష్ట్రాల్లో నైతిక బాధ్యతను చాటుకోవాలి. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయించి, కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో రాజీనామాలు చేయించాలి. మేము ఈ ఎన్నికల ఫలితాలను గుర్తించడం లేదు, అందుకే మా పదవులను త్యజించి బ్యాలెట్ పేపర్ ఎన్నికలను కోరుతున్నాం అని తమ ప్రభుత్వాలను రద్దు చేసినప్పుడే ఖర్గే వాదనలకు దేశంలో కనీస విశ్వసనీయత లభిస్తుంది.అధికారంలో ఉన్న రాష్ట్రాల గద్దెలను అంటిపెట్టుకుని ఉంటూ, కేంద్రంలోని ప్రభుత్వంపై మాత్రం అక్రమం అనే ముద్ర వేసి లోక్‌సభ రద్దును కోరడం పూర్తిగా రాజకీయ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాతీర్పు, ఓడిపోతే వ్యవస్థల కుట్ర అనే కుంటిసాకులు ఇక ఏమాత్రం ప్రజాక్షేత్రంలో చెల్లవు. కాంగ్రెస్ హైకమాండ్ నిజంగానే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను తిరస్కరిస్తే.. ముందుగా తమ సొంత రాష్ట్రాల్లో అధికారాన్ని వదులుకుని రాజీనామాలతో మొదలుపెట్టాలి. అప్పుడు మాత్రమే వారి పోరాటానికి నైతిక బలం చేకూరుతుంది.

'చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

న్యాయవ్యవస్థ పనితీరులో కరుణ, మానవత్వాల పాత్రను నొక్కి చెబుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టం ప్రాథమిక బాధ్యత అది ఎవరిని పాలిస్తుందో ఆ ప్రజలకు సులభంగా అర్థం కావడం, అలానే ప్రజలను ఆ చట్టం కూడా అర్థం చేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. ఇక్కడ చట్టం అనేది ప్రజల కష్టాలను, వారి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని ఉద్దేశం వచ్చేలా మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులలో మానవీయ కోణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ప్రొఫెసర్ (డాక్టర్) ఎన్ ఆర్ మాధవ్ మీనన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మెమోరియల్ లెక్చర్ (స్మారక ఉపన్యాసం) కార్యక్రమంలో పాల్గొని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ కోణాల్ని కూడా చూడాలని సూచించారు. 'మొదట తీర్పులు ఇచ్చేటప్పుడు కరుణ అంటే ఏంటో మనం తెలుసుకోవాలి. న్యాయ నిర్ణయాలలో కరుణ చూపడం అంటే కేవలం సానుభూతి చూపడమూ, ఉదారతనో కాదు. తీర్పును ఒక వైపునకు మొగ్గు చూపేలా చేసేది అంతకన్నా కాదు. ఒక కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ పరిస్థితుల్ని క్రమశిక్షణతో చూసే నిబద్ధత. న్యాయ నిర్ణయాల్లో కరుణ లేకపోతే చట్టం కేవలం కాగితాల మీద రూల్స్ మాట్లాడే ఒక కఠినమైన వ్యవస్థగా మారిపోతుంది' న్యాయవ్యవస్థలో కనిపించని బాధితులపై కూడా దృష్టి పెట్టాలని సీజేఐ సూచించారు. లైంగిక హింసకు గురైన వ్యక్తులు, విచారణ ఎదుర్కొంటున్న ఖైదీల కుటుంబాలు, దివ్యాంగులు వంటి వారి పరిస్థితులను కూడా న్యాయ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. వారి వాదనలు కోర్టు రికార్డులకు చేరకపోయినా వారి ఆవేదనను ఆలకించాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉందన్నారు. ఇంకా న్యాయస్థానాల్లో వాదనలు, వెలువడే తీర్పులు



పిటిషనర్లకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండాలని ఇంకా పోలీస్ స్టేషన్ల స్థాయిలోనే న్యాయ సహాయం అందాలని ఆయన పిలుపునిచ్చారు.

సాంకేతికత న్యాయాన్ని వేగవంతం చేయొచ్చు కానీ!

ఇదే కార్యక్రమంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి అంతేకానీ న్యాయం విషయంలో ఏమాత్రం ఉదాసీనంగా వ్యవహరించొద్దని అన్నారు. ఇంకా న్యాయ ప్రక్రియలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదని చెప్పిన ఆయన అది ప్రక్రియను వేగవంతం చేయగలదేమో కానీ న్యాయమైన తీర్పును ఇవ్వలేదని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ మానవీయ కోణంలో ఆలోచించలేదని వ్యాఖ్యానించారు. మానవ మేధస్సును, న్యాయమూర్తి జీవిత కాలంలో సంపాదించిన అనుభవాన్ని సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. అందుకే న్యాయమూర్తులకు టెక్నాలజీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని పేర్కొన్నారు

సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు

ఇదెలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం సోమవారం రోజు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. నియామకాలపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలిజీయం సెప్టెంబర్ 28న చేసిన సిఫార్సులకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. తాజాగా ముగ్గురు న్యాయమూర్తుల నియామకంతో సుప్రీం కోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీం కోర్టు మంజూరు చేసిన మొత్తం న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య 38 కాగా, ఒక స్థానం ఖాళీగా ఉంది.

జస్టిస్ సునీతా అగర్వాల్- 1990లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఈమె, 2011లో అలహాబాద్ హైకోర్ట్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2023 జులై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె నియామకంతో సుప్రీం కోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు చేరింది. జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ- 2011లో అలహాబాద్ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఈయన, అంతకుముందు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 2023 జులైలో బాంబే హైకోర్టు సీజేగా, తర్వాత 2025 జనవరి నుంచి దిల్లీ హైకోర్టు సీజేగా పనిచేస్తున్నారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్- దిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయ విద్య పూర్తి చేసి పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో తొలిసారి ఝార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రెండేళ్లకు శాశ్వత న్యాయమూర్తి హోదాను పొందారు. 2023 ఏప్రిల్‌లో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, తర్వాత 2025 జులై నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తూ వచ్చారు.

ఇది అస్థిరత యుగం

ప్రస్తుతం ప్రపంచ పరిణామాలు ఎంతో అనిశ్చితి, ఘర్షణలు, తీవ్ర అస్థిరతతో నిండి ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రపంచం ఫ్లక్స్ యుగంలోకి (నిరంతర మార్పులు, తీవ్ర అస్థిరత) వెళ్తోందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. ఈ సంక్షోభాలతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలో రెండు ప్రధాన ఘర్షణలతో పాటు ఇతర ఉద్రిక్తతలు కూడా కొనసాగుతున్నాయని, టారిఫ్స్‌లో అనిశ్చితి వాతావరణం నెలకొందని చెప్పుకొచ్చారు. వీటితో పాటు మార్కెట్‌కు సంబంధించినవి కాని ఇతర అంశాల ప్రభావం కూడా పెరుగుతోందన్నారు. అయితే ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. న్యూదిల్లీలో 3 రోజుల పాటు జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ ముగింపు కార్యక్రమంలో జైశంకర్ ఇలా మాట్లాడారు. 'రెసిలెన్స్ ఇన్ ఆన్ ఏజ్ ఆఫ్ ఫ్లక్స్' అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించారు. ఇందులో సింగపూర్ మాజీ విదేశాంగ మంత్రి జార్జ్ యోంగ్ బూన్ యోతో కలిసి జైశంకర్ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

'ప్రపంచం తీవ్ర మార్పులకు (అస్థిరత) లోనవుతోంది. వివిధ దేశాల మధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు, సుంకాలలో వస్తున్న హెచ్చుతగ్గులు అంతర్జాతీయ పరిస్థితుల్ని అల్లకల్లోలంగా మారుస్తున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల నుంచి పుట్టుకొస్తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన కర్తవ్యం'

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులపై అడిగిన ప్రశ్నకు స్పందించిన జైశంకర్- ప్రస్తుత పరిస్థితులు తీవ్ర అస్థిరంగా, అనిశ్చితితో, అల్లకల్లోలంగా ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ప్రపంచ దేశాలకు సవాళ్లను విసురుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్ని ఆయన తుపాన్ తరంగాలతో పోల్చారు. అలాంటి అస్థిర సమయం నడుస్తుందన్న ఉద్దేశంతో ఇలా వ్యాఖ్యానించారు. కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో భారత్ ఎన్నో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ముందుకు వెళ్లిందని అదే బాటలో ఇప్పుడు కూడా బయటపడతామన్న నమ్మకం ఉందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రస్తుత ఉద్రిక్తతలు, ఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువులు వంటి కీలక రంగాల్లో ఎదురయ్యే సమస్యల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకొని దానికి అనుగుణంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

గ్లోబల్ సౌత్ గళం వినిపించాల్సిందే

ప్రపంచ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని, సమస్యల్ని భారత్ బలంగా వినిపిస్తోందని, ఆ దేశాలు కూడా అదే కోరుకుంటూ భారత్‌పైనే ఎంతో నమ్మకం ఉంచాయని జైశంకర్ వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఇతర ఆర్థిక వనరులకు సంబంధించిన సమస్యలు సాధారణంగానే ఉన్నాయని చెప్పారు. భారత్ ప్రస్తావిస్తున్న అంశాలు కేవలం తమ ప్రయోజనాలకే పరిమితం కాలేదని, ఇది గ్లోబల్ సౌత్‌లోని అనేక దేశాల విస్తృత ప్రయోజనాల్ని కాపాడుతుందని జైశంకర్ వివరించారు. సాధారణంగా అభివృద్ధి చెందుతున్న అలాగే తక్కువ, మధ్య ఆదాయం కలిగిన దేశాల్ని ఇలా గ్లోబల్ సౌత్ పేరుతో పిలుస్తుంటారు. భారత్ కూడా ఇదే కేటగిరీలో ఉంది.

రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ వైఖరి

ఇదే వేదికగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సమస్య గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంక్షోభానికి కేవలం చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ తన విధానాన్ని పునరుద్ఘాటించింది. ఈ విషయంలో భారత్ కేవలం మాటలకే పరిమితం కాకుండా, యుద్ధం ముగింపు విషయంలో ఆ దేశాలతో నేరుగా చర్చలు జరుపుతున్నట్లు ఆయన ఇదివరకే స్పష్టం చేశారు. ఇదే సమయంలో నల్ల సముద్రం నుంచి గల్ఫ్ ప్రాంతం వరకు వాణిజ్య నౌకలపై దాడులు జరగడం కూడా ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన హెచ్చరించారు. చివరగా ప్రపంచవ్యాప్తంగా శాంతి భద్రతల పర్యవేక్షణలో బహుపాక్షిక వ్యవస్థల (మల్టీలాటరల్ ఇన్‌స్టిట్యూషన్స్) పాత్ర తగ్గిపోతోందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధానంగా ఐక్యరాజ్యసమితి నిశ్చల స్థితిలో ఉండిపోయిందని, ఇందులో సంస్కరణలు జరగకుండా కొన్ని దేశాలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ (ూ×) విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ



సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు.

ఙజ్ఞూూ డీల్‌తో సంబంధాలు మరింత బలోపేతం

భారత్- స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా-యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (జుఖీూూ) మధ్య జరిగిన ఙజ్ఞూూ (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన జుఖీూూ మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.

15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ఙజ్ఞూూ కేవలం ఎగుమతి, దిగుమతులపై సుంకాలను మాత్రమే తగ్గించే ఒప్పందం కాదని, దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఇది పునాది వేస్తుందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు వివరించారు. ఈ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఙజ్ఞూూ) కింద జుఖీూూ దేశాలు భారత్‌లో 15 ఏళ్లలో ఏకంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్ని ప్రోత్సహించడం, ఇందులో భాగంగా సుమారు 10 లక్షల ఉద్యోగాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు మోదీ కూడా భారత్- జుఖీూూ ఒప్పందాన్ని భారత్- స్విస్ ఆర్థిక సంబంధాల్లో కీలక ముందడుగుగా అభివర్ణించారు. గై పార్మెలిన్ అక్టోబర్ 5 నుంచి 7 వరకు భారత పర్యటనలో ఉండనున్నారు. రాష్ట్రపతి, ప్రధానితో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత ఏర్పడింది

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు?



ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా లేదా మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఎల్లప్పుడూ చట్టప్రకారం నడుచుకోవాలని హితవుపలికింది. ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఎన్నికల సంఘంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసింది. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది. అలాగే సీఈసీ, ఈసీలకు చట్టపరంగా ఇచ్చిన ప్రాసిక్యూషన్ మినహాయింపు చెల్లుబాటుపై కూడా విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎన్నికల సంఘం తీసుకున్న ఏ నిర్ణయమైనా చట్టవిరుద్ధమని తేలితే దాన్ని తక్షణమే రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. అయితే ఈసీ తీసుకున్న నిర్ణయాలను తాత్కాలికంగా నిలిపివేసేందుకు సుప్రీం నిరాకరించింది.

ఫారం 6లో మార్పులను ఆమోదించలేదు : సుప్రీం

మరోవైపు కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఉపయోగించే ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు సోమవారం వెల్లడించింది. 2025లో ఈ ఫారంలో ప్రవేశపెట్టిన అనుబంధ పత్రంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలిపింది. "ఎస్ఐఆర్ కోసం ఫారం 6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ లేని కాలానికి, నిబంధనల (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగిస్తాం." అని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈసీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. "ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకోవాలని, అన్ని నిర్ణయాలు ఈ విధంగానే తీసుకున్నారని తాము భావిస్తున్నట్లు" ధర్మాసనం పేర్కొంది.

పట్నాకు చెందిన రాకేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టులో ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఎన్నికల సంఘానికి చెందిన అన్ని అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారా, లేదా అనేది నిర్ధరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఒక వేళ సీఈసీ ఏకాభిప్రాయం లేదా మెజారిటీతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటే, వాటిని అనధికారికమైనవిగా ప్రకటించాలని, ఆయనపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. అలాగే "ఈ కేసు తుది విచారణ జరిగే వరకు జ్ఞానేశ్ కుమార్ సీఈసీ విధులు చేపట్టరాదని ఆదేశించాలి. ఈ సమయంలో కమిషన్? కార్యకలాపాలు ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్? సింగ్?, వివేక్? జోషిల ఏకగ్రీవ నిర్ణయం ద్వారా జరగాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్? పదవికి ఎవరినైనా నియమించాలంటే, గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఒక కమిటీ సిఫారసు మేరకే అది జరగాలని ఆదేశించాలి" అని పిటిషనర్? పేర్కొన్నారు.

సీఈసీ ద్రోహం చేశారు!

సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసు విషయమై కేంద్రానికి, ఈసీకి నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జ్ఞానేశ్?కుమార్?పై తీవ్ర విమర్శలు చేసింది. ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించింది.

"1. ఎస్?ఐఆర్?ను తాత్కాలికంగా, చట్టవిరుద్ధంగా, అజాగ్రత్తగా నిర్వహిస్తున్న తీరు. 2. సుప్రీంకోర్టులోని ప్రస్తుత, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల విమర్శలు. 3. సరైన విచారణ లేకుండా విచ్చలవిడిగా ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగించడం. మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని, మన గణతంత్ర దేశ సమగ్రతకు కీలకమైన ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక అద్భుతమైన అవకాశం ఉంది."

'ఎన్నికలు ఎలా నిర్వహించాలనే దానికి తొలి సీఈసీ, దివంగత సుకుమార్? సేన్ మంచి ప్రమాణాలను నెలకొల్పారు. కానీ వాటిలో ఒక్కదాన్నీ ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్? పాటించలేదు. వాస్తవానికి దురుద్దేశపూరితమైన ఫారమ్?-6 సవరణ, అతని నీచమైన, ఏమాత్రం సమర్థించలేని ప్రవర్తనకు ఒక ఉదాహరణ. వాస్తవానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ అబద్దాలు చెప్పడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించి, రాజ్యాంగాన్ని అక్షర రూపంలోనూ, స్ఫూర్తి రూపంలోనూ ద్రోహం చేశారు' అని జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు.

అలా మొదలైంది!

ఓ ప్రముఖ వార్తాపత్రిక ఈ సెప్టెంబర్? 25న సంచలన కథనాన్ని ప్రచురించింది. అందులో ఈసీఈ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్లకు తెలియకుండా లేదా వారి ఆమోదం లేకుండా ఎస్?ఐఆర్?పై నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారని రాసింది. అందుకే కాదు వీటిపై ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొంది. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్?, ఏ సంస్థలో అయినా భిన్నాభిప్రాయాలు ఉండడం సాధారణమేనని పేర్కొంది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులన్నీ పూర్తి చట్టపరమైన ఆమోదం కలిగి ఉంటాయని చెప్పింది. దీనితో ప్రతిపక్ష పార్టీలు సీఈసీ మండిపడ్డాయి. ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారని విమర్శించాయి.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



పీఎం సూర్య ఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "సేవా సేతు అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 4 సబ్ డివిజన్ల పరిధిలోని 15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు జరగనున్నాయి. ఈ సందర్భంగా సేవా సేతు అభియాన్ పోస్టర్‌ను కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించే క్యాంపుల ద్వారా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించవచ్చని కలెక్టర్ అన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30,000, 2 కిలోవాట్లకు రూ.60,000, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయనున్నారని.. అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పథకానికి సంబంధించిన మరింత సమాచారం కోసం ఏపీసీపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ యు.హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, విశ్వేశ్వరప్రసాద్, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రతిభ.. పురస్కారాలతో ప్రతిష్ఠ

- ఘనంగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం
- విజేతలకు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర హెచ్ఎం అభినందనలు

విజయవాడ, మహానగర్



నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. స్వచ్ఛ మునిసిపాలిటీలు, స్వచ్ఛ గ్రామపంచాయతీలు, స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ అంగన్వాడీలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ వసతిగృహాలు తదితర కేటగిరీల్లో మొత్తం 69 అవార్డులు లభించాయి. వీటిని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర విజేతలకు అందజేసి అభినందనలు తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన స్వచ్ఛ సైనికులను ప్రశంసించారు. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా జిల్లా కలెక్టరేట్ అవార్డు సాధించగా కలెక్టర్ లక్ష్మీశ అవార్డును స్వీకరించారు. అదేవిధంగా స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా వీఎంసీ ప్రధాన కార్యాలయం కూడా అవార్డును సొంతం చేసుకుంది. స్వచ్ఛ మునిసిపాలిటీగా తిరువూరు మునిసిపాలిటీ అవార్డును కైవసం చేసుకుంది. గంద్రాయి, మైలవరం, గూడవల్లి, జూపూడి గ్రామపంచాయతీలు స్వచ్ఛ గ్రామపంచాయతీల కేటగిరీలో పురస్కారాలు పొందాయి. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ స్టార్టప్స్ కేటగిరీలో సిసిర ఎలిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అవార్డును సొంతం చేసుకుంది. కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల్లో స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, గ్రామ స్వరాజ్యంతో పాటు దేశవ్యాప్తంగా పరిశుభ్రతను పాటించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ అంటే కేవలం ఓడీఎఫ్ సాధించడం మాత్రమే కాదని, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ, నదులు, జల వనరులు, భూగర్భ జలాల సంరక్షణ, కాలుష్య నియంత్రణ కూడా అందులో భాగమేనని స్పష్టం చేశారు. పరిశుభ్రత లోపిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గౌరవ ప్రధాని వికసిత్ భారత్, గౌరవ ముఖ్యమంత్రి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించాలంటే కేవలం జీడీపీ, ఆర్థిక గణాంకాలపై దృష్టిపెట్టడం మాత్రమే కాకుండా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, సహజ వనరుల సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ అన్నింటా స్వచ్ఛత అనేది మనిషి జీవన ప్రమాణాలను పెంచుతుందన్నారు. స్వచ్ఛతకు సంబంధించి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆశయాల సాధనలో ప్రజలు కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి సంస్థ, ప్రతి స్థానిక సంస్థ స్వచ్ఛతను ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్నే కాకుండా మన ఆలోచనా విధానాన్ని, మానసిక ఉల్లాసాన్ని కూడా ప్రభావితం చేస్తాయన్నారు. మనచుట్టూ ఉన్న వాతావరణం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉన్నప్పుడు మనలో సానుకూల ఆలోచనలు పెంపొందడంతో పాటు ఉత్సాహం, ప్రశాంతత, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛతలో ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా నిలపడంలో సమష్టిగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు.
విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ ఇప్పటి 69 జిల్లాస్థాయి అవార్డుల స్ఫూర్తితో వచ్చే ఏడాది 100 అవార్డుల సాధన లక్ష్యంగా పనిచేద్దామని పేర్కొన్నారు. విజయవాడ నగరం స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణలో నిరంతరం మెరుగైన ఫలితాలు సాధిస్తూ జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లోనూ సత్తా చాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, జెడ్పీ సీఈవో జె.అరుణ, వీఎంసీ అడిషనల్ కమిషనర్లు ఎ.రవీంద్రరావు, కె.శకుంతల, చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నిర్మల గ్లోరీ, డిప్యూటీ కమిషనర్ జి.సృజన తదితరులతో పాటు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 69 స్వచ్ఛాంధ్ర అవార్డులు

స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026లో భాగంగా జిల్లాకు వివిధ విభాగాల్లో 69 అవార్డులు దక్కాయి. స్వచ్ఛ మున్సిపాలిటీల విభాగంలో తిరువూరు మున్సిపాలిటీ, స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో గంద్రాయి, మైలవరం, గుడవల్లి, జూపూడి ఎంపికయ్యాయి. స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్‌ల విభాగంలో ఝాన్సీ లక్ష్మి, ఆశా జ్యోతి, గాంధీ సెంటర్ ఎస్ఎల్ఎఫ్‌లు, గ్రామ సంస్థల విభాగంలో జూపూడి, సోమవరం, అనిగండ్లపాడు, వత్సవాయి, విస్సన్నపేట సంస్థలు అవార్డులకు ఎంపికయ్యాయి. స్వచ్ఛ పాఠశాలల విభాగంలో కాచవరం, దామూలూరు, రంగాపురం, వెల్లంకి, నున్న పాఠశాలలు, స్వచ్ఛ అంగన్‌వాడీ విభాగంలో అన్నవరం, చెవిటికల్లు, తాడేపల్లి, మహంతిపురం--1, కోటికలపూడి కేంద్రాలు ఎంపికయ్యాయి. స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో తిరువూరు, విస్సన్నపేట, నందిగామ, వేదాద్రి, పెద్దవరం, అనిగండ్లపాడు తదితర ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో జిల్లా కలెక్టరేట్, జిల్లా పౌరసరఫరాల కార్యాలయం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంపికయ్యాయి. స్వచ్ఛ బస్‌స్టేషన్లు, వసతి గృహాలు, పరిశ్రమలు, స్వచ్ఛత స్వచ్ఛంద సంస్థలు, పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, నివాస పాఠశాలలు, కాలనీలు, పర్యాటక--వారసత్వ ప్రదేశాలు, పార్కులు, హోటళ్లు, వ్యర్థాల నిర్వహణ స్టార్టప్‌లు, స్వచ్ఛ రథం, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విభాగాల్లోనూ ఎన్టీఆర్ జిల్లాకు అవార్డులు లభించాయి. ప్రముఖ పర్యాటక ప్రదేశమైన భవానీ ఐలాండ్ స్వచ్ఛ పర్యాటక ప్రదేశాలు, వారసత్వ ప్రదేశాల విభాగంలో అవార్డుకు ఎంపికైంది.

ఏపీలో దేశవాళీ క్రికెట్ సందడి

నాలుగు వేదికల్లో ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌లు

విశాఖ, విజయనగరం వేదికలుగా వినూ మన్కడ్ ట్రోఫీ

మూలపాడులో ఆంధ్ర--కర్ణాటక, ఆంధ్ర--హైదరాబాద్ రంజీ మ్యాచ్‌లు

అనంతపురంలో ఆంధ్ర--జార్ఖండ్ సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్

మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్



రాష్ట్రంలో బీసీసీఐ దేశవాళీ క్రికెట్ సందడి నెలకొననుంది. విశాఖపట్నం, విజయనగరం, మూలపాడు, అనంతపురం వేదికలుగా ప్రతిష్ఠాత్మక వినూ మన్కడ్ ట్రోఫీ, రంజీ ట్రోఫీ, సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సెక్రటరీ సానా సతీష్ బాబు తెలిపారు. ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు విశాఖపట్నం, విజయనగరం వేదికలుగా అండర్-19 వినూ మన్కడ్ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఈ' మ్యాచ్‌లు జరుగుతాయి. గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, చండీగఢ్ జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా మూలపాడు క్రికెట్ స్టేడియంలో ఈ నెల 11 నుంచి 14 వరకు ఆంధ్ర--కర్ణాటక, 18 నుంచి 21 వరకు ఆంధ్ర--హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఆంధ్ర--జార్ఖండ్ మ్యాచ్ అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో నిర్వహించనున్నారు.
బీసీసీఐ దేశవాళీ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి స్టేడియాలు, పిచ్‌లు, మౌలిక వసతులు, ఆటగాళ్లకు అవసరమైన సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సానా సతీష్ బాబు తెలిపారు. మ్యాచ్‌లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు బీసీసీఐ దేశవాళీ మ్యాచ్‌లకు ఏపీలోని వివిధ ప్రాంతాలను వేదికలుగా తీర్చిదిద్దేందుకు ఏసీఏ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

జెడ్పీ సీఈఓ డా. జె. అరుణకు స్వచ్ఛాంధ్ర అవార్డు



విజయవాడ, మహానగర్

జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు జిల్లా పరిషత్ సీఈఓ డా. జె. అరుణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డు లభించింది. 'స్వచ్ఛ రథం బెస్ట్ పెర్ఫార్మెన్స్' కేటగిరీలో అందించిన ఈ అవార్డును సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ చేతుల మీదుగా డా. జె. అరుణ షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం స్వచ్ఛత కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి తక్కువ సమయంలోనే ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఈ అవార్డు ప్రదానం చేసినట్లు అధికారులు తెలిపారు. అవార్డు అందుకున్న డా. జె. అరుణను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

భవానీ ఐలాండ్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు



విజయవాడ, మహానగర్

స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం భవానీ ఐలాండ్‌కు అవార్డు లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, వీఎంసీ హెచ్ఎం ధ్యానచంద్ర చేతుల మీదుగా జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ పురస్కారాన్ని అందుకున్నారు.

జిల్లా సామర్థ్యాలకు అనుగుణంగా ఆర్థిక వృద్ధికి అడుగులు

అగ్రిప్రెన్యూర్‌షిప్, ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో కీలకపాత్ర పోషించనున్న ఎన్టీఆర్ జిల్లా

అన్ని శాఖల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకం

ప్రణాళిక రూపకల్పన సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ


విజయవాడ, మహానగర్



రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్) కీలకపాత్ర పోషించనుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఎన్టీఆర్ జిల్లా చురుకైన పాత్ర పోషించగలదని ఆకాంక్షించారు. నవ్య రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దానిచుట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమథన చర్చలు, వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఎల్ఈఏ అసోసియేట్స్ (ఏఈఆర్‌పీ) బృంద సభ్యులతో పాటు ప్రణాళిక, పరిశ్రమలు, ఏపీఐఐసీ, వ్యవసాయం, అనుబంధ రంగాలు తదితర శాఖల అధికారులు హాజరుకాగా ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో కూడిన అమరావతి ఎకనమిక్ రీజియన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలపై చర్చించారు. హైటెక్ వ్యవసాయంతో పాటు క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికత అనుబంధ వృద్ధికి అవకాశముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జిల్లాలో సేవా రంగం ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోందని.. తొలి సవరించిన అంచనాల ప్రకారం వర్తమాన ధరల వద్ద 2024-25 జీవీఏలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం, పారిశ్రామికరంగం వాటా 21 శాతం కాగా సేవా రంగం వాటా 67 శాతంగా ఉందన్నారు. జిల్లాలో నేచురల్ ఫార్మింగ్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధికి పుష్కల అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో 40 వేల మందికి పైగా ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తున్నట్లు వివరించారు. ఏడు నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చురుగ్గా అడుగులు పడుతున్నాయన్నారు. ఇన్వెస్టర్స్ డెస్క్, ల్యాండ్ బ్యాంకు చొరవతో పెద్దఎత్తున పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్ భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల వృద్ధికి మరింత చొరవ చూపాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిశ్రమలు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లా దార్శనిక ప్రణాళిక, సామాజిక ఆర్థిక నివేదిక, విపత్తు నిర్వహణ ప్రణాళికపైనా చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్‌లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్

21 నుంచి జియో ఐపీవో!



న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : దేశంలో అతిపెద్ద ఐపీవోకి రిలయన్స్ ఇండస్ట్రీస్‌నకు చెందిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో సిద్ధమవుతున్నది. ఈ నెల 21న ప్రారంభంకానున్న వాటాల విక్రయం ఈ నెల 23న ముగియనున్నదని కంపెనీకి సంబంధించిన వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ఈ డిజిటల్ సర్వీసును ఈ నెల 28న స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని సంస్థ యోచిస్తున్నది. ఈ నెల చివర్లో లిస్ట్ కానున్న జియో ప్లాట్‌ఫామ్ విలువ 143-146 బిలియన్ డాలర్లు లేదా రూ.12 లక్షల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఈ ఐపీవోపై కంపెనీ వర్గాలు స్పందించడానికి నిరాకరించాయి. దేశంలో అతిపెద్ద ఐపీవో అయిన జియో ప్లాట్‌ఫామ్ ఐపీవో విలువ 3.8 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనా. 2008 తర్వాత రిలయన్స్ గ్రూపు నుంచి వస్తున్న తొలి ఐపీవో ఇదే కానున్నది. ఈ ఐపీవోకి సంబంధించి ఆగస్టు 28న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్న సంస్థ.. గత నెలలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు నైని బొగ్గు



హైదరాబాద్ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌నకు బొగ్గు కొరత సమస్యను అధిగమించేందుకు టీజీ జెన్‌కో చర్యలు చేపట్టింది. ఒడిశాలోని నైని కోల్‌బ్లాక్ నుంచి రోజుకు 16 వేల టన్ను ల బొగ్గును కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు సంబంధించి టీజీ జెన్‌కో సీఎండీ ఎస్ హరీశ్ సోమవారం ఒడిశాలోని నైని కోల్‌బ్లాక్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా రైల్వే వ్యాగన్ల సంఖ్యను పెంచడం, స్థానిక రవాణా అడ్డంకులను అధిగమించడంపై సీఎండీ సింగరేణి అధికారులతో ప్రధానంగా చర్చించారు. నైనిలో లభిస్తున్న నాణ్యమైన బొగ్గు యాదాద్రి ప్లాంట్‌నకు అవసరమని, ఈ సరఫరాకు సింగరేణి అధికారులు సహకరించాలని కోరారు.

మదుపర్లూ.. జర భద్రం.. అజ్ఞాత సలహాలను ఆచరించకండి

ఫిన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్త
ఆకర్షణీయ రాబడులను నమ్మి మోసపోవద్దు
హెచ్చరించిన సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

చండీగఢ్ : అజ్ఞాత వ్యక్తుల సలహాలను అనుసరించవద్దని, ఫిన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్తగా ఉండాలని, ఆకర్షణీయ రాబడులను అందజేస్తామన్న మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దంటూ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం మదుపర్లను హెచ్చరించారు. పెట్టుబడులపై మదుపర్లలో అవగాహనను పెంచడం కోసం 'ప్రాజెక్ట్ జాగరూక్' కార్యక్రమాన్ని సెబీ దేశవ్యాప్తంగా ప్రారంభించింది. పంజాబ్ విశ్వవిద్యాలయంలో 'ప్రాజెక్ట్ జాగరూక్' ప్రారంభం సందర్భంగా పాండే మాట్లాడుతూ.. కేవలం ఎవరో చెప్పారని ఎవరూ ఎక్కడా పెట్టుబడులకు దిగవద్దని సూచించారు. అందరూ మదుపు చేస్తున్నారని, పెట్టుబడులపై ఏమాత్రం అవగాహన లేకుండానే తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే నష్టపోతారని హితవు పలికారు. పెట్టుబడులపై పూర్తిగా తెలుసుకున్నాకే ఓ



నిర్ణయానికి రావడం ఉత్తమమని సలహా ఇచ్చారు.

రెగ్యులేటెడ్ ప్రొడక్ట్స్‌ను వాడాలి

గడిచిన దశాబ్దకాలంలో భారతీయ క్యాపిటల్ మార్కెట్లలో మదుపర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని పాండే గుర్తుచేశారు. ఈ క్రమంలోనే మోసపూరిత పెట్టుబడులపట్ల జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. అందుకే సెబీ నియంత్రణలోని ఉత్పత్తులు, వేదికలు, సంస్థలనే పెట్టుబడుల విషయంలో వినియోగించాలని సూచించారు. ఇక కెరియర్ ఆరంభంలోనే యువత పెట్టుబడులను మొదలుపెడితే లాభదాయకమని, మదుపును కొనసాగిస్తూపోతే చక్రవడ్డీ ప్రయోజనాలు అందుతాయని సలహా ఇచ్చారు.

11 ప్రాంతీయ భాషల్లో..

దేశవ్యాప్తంగా మోసపూరిత పెట్టుబడులపై మదుపర్లను అప్రమత్తం చేయడానికి ఇంగ్లిష్, హిందీతోపాటు మరో 11 ప్రాంతీయ భాషల్లోనూ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు పాండే తెలిపారు. టెలివిజన్, ప్రింట్, రేడియో, సినిమా, ఔట్‌డోర్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, సోషల్ మీడియా, ఓటీటీ, వాట్సాప్ సహా ఇతర భౌతిక మార్గాల్లోనూ అమాయక మదుపర్ల ప్రయోజనాల రక్షణకు కృషి చేస్తున్నట్టు వివరించారు. 'ప్రాజెక్ట్ జాగరూక్'లో భాగంగా సెబీ, స్టాక్ ఎక్స్చేంజీలు, డిపాజిటరీలు, భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్లు కలిసి సమన్వయంతో, పరస్పర సహకారంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. అలాగే యూనివర్సిటీల్లోనూ ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నట్టు సెబీ చీఫ్ పాండే చెప్పారు.

ఇండిగో విమాన చార్జీలకు రెక్కలు

న్యూఢిల్లీ : విమాన టికెట్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఇంధన సర్‌చార్జిలను పెంచుతూ దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో తీసుకున్న నిర్ణయంతో విమాన టికెట్ ధరలు పెరిగాయి. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా విమాన చార్జీలు రూ.100 నుంచి రూ.350 వరకు పెరుగనున్నాయి. ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించేవారిపై కూడా మరింత భారం పడనున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గడిచిన నెల రోజుల్లో ఇంధన ధరలు 14 శాతం వరకు పెరిగాయని, దీంతో సంస్థపై పడుతున ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా సర్‌చార్జిని పెంచినట్టు పేర్కొంది. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు సర్‌చార్జిని పెంచడం ఇది రెండోసారి. 500 కిలోమీటర్ల దూరం వరకు ఫ్యూయల్ సర్‌చార్జిని రూ.375గా వసూలు చేయనుండగా, 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ.600, 1001-1,500 కిలోమీటర్ల వరకు రూ.900, 1,500-2 వేల కిలోమీటర్ల వరకు రూ.1,150 చొప్పున వసూలు చేయనున్నది. అలాగే 2 వేల కిలోమీటర్ల పైగా ప్రయాణంపై రూ.1,300 ఫ్యూయల్ సర్‌చార్జిని విధిస్తున్నది. భారత్ నుంచి సార్క్ దేశాల మధ్య



నడిచే విమాన సర్వీసుల్లో ఫ్యూయల్ సర్‌చార్జిని రూ.1,000 నుంచి రూ.3 వేల వరకు, ఆఫ్రికా దేశాలకు రూ.6 వేల చొప్పున, యూరప్ సర్వీసులకు రూ.10 వేల చొప్పున వసూలు చేయనున్నది.

పాకిస్తాన్ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్

పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ఆ దేశ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేశారు. ఏషియన్ గేమ్స్‌లో తాత్కాలిక సారధిగా వ్యవహరించిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ఫర్హాన్ ఛార్జ్ తీసుకుంటాడు. ఇప్పటివరకు పాక్ టీ20 కెప్టెన్‌గా సల్మాన్ అఘా వ్యవహరించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ అక్టోబర్ 9, 11, 13 తేదీల్లో జరుగుతుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును కూడా ప్రకటించారు. ఈ జట్టులో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదికి చోటు దక్కలేదు. అయితే ఈ ఇద్దరినీ ఆతర్వాత పాక్‌లోనే జరిగే వన్డే ట్రై సిరీస్‌కు ఎంపిక చేశారు.

ఈ ట్రై సిరీస్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్ పాల్గొంటుంది. వన్డే టోర్నీలో పాక్ కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది వ్యవహరిస్తాడు.

శ్రీలంకతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టు

సాహిబ్‌జాదా ఫర్హాన్ (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, హసన్ నవాజ్, మహ్మద్ ఇమ్రాన్, ఖ్వాజా నఫే (వికెట్‌కీపర్), మాజ్ సదాఖత్, నసీమ్ షా, రజావుల్లా, సైమ్ అయూబ్, సల్మాన్ మిర్జా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్.



వన్డే ట్రై సిరీస్ కోసం పాక్ జట్టు

షాహీన్ అఫ్రిది (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, ఖుజీ ఫోరి (వికెట్‌కీపర్), నసీమ్ షా, రజావుల్లా, సాద్ బైగ్ (వికెట్‌కీపర్), సైమ్ అయూబ్, సల్మాన్ అలీ ఆఘా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్

రేపటి నుంచి మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్

హైదరాబాద్ : క్రికెటర్‌గా రాణించాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఆ కెరీర్‌ను కొనసాగించలేక ఇతర రంగాల్లో స్థిరపడిన వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీఏహెచ్)ను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎస్వీ రెడ్డి తెలిపారు. ఇందులో తొలి ప్రయత్నంగా ఈ నెల 7వ తేదీ నుంచి రెనోవా మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్ (ఎంఎస్ఎల్) నిర్వహిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ లీగ్ విన్నర్ ట్రోఫీని సినీ నటుడు అలీ ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు జరిగే టోర్నీలో కేఎల్ఆర్ ట్రాన్స్‌ఫార్మర్స్, మాస్పేసెస్, రేజింగ్ బుల్స్, జూపర్ ఎల్ఈడీ బుల్లెట్స్, సన్‌క్రెస్ట్ వారియర్స్, టెర్మినస్, రీట్ మేవరిక్స్ జట్లు బరిలోకి దిగనున్నాయి. 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



స్పోర్ట్స్

వైభవ్ వెయిట్ చేయాల్సిందే!




లక్నో: టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీ20 జట్టులో సుస్థిర స్థానం సంపాదించాలంటే మరికొంతకాలం వేచి చూడక తప్పేట్టు లేదు. మంచి ఫామ్‌లో ఉన్న అతడిని వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఆడిస్తారా? లేక ఓపెనర్లుగా అభిషేక్-సంజూనే కొనసాగిస్తారా? అని చర్చలు సాగుతున్న నేపథ్యంలో భారత ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గౌతీ స్పందిస్తూ.. 'ఇది నాక్కూడా కొత్త అనుభవమే. అతడు (వైభవ్) మంచి ఫామ్‌లో ఉన్నాడు. కానీ జట్టులో కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న నైపుణ్యం కల్గిన ఆటగాళ్లను తీసేసి ఉన్నఫళంగా అతడిని తీసుకోవడం కరెక్ట్ కాదు. ఈ విషయాన్ని నేను వైభవ్‌కు అర్థమయ్యేలా చెప్పా. అతడు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ వైభవ్‌ను ఆడించాల్సి వస్తే అభిషేక్, సంజూలలో ఎవరిని తప్పించాలన్నది చాలా కష్టమైన ప్రశ్న. గత రెండేండ్లుగా మెరుగ్గా ఆడుతున్న ఈ జోడీని మూడు, నాలుగు మ్యాచుల్లో సరిగ్గా ఆడలేదని, అదీగాక ఒక యువ ఆటగాడి కోసం తప్పించడం సరైన నిర్ణయం కాదు' అని చెప్పుకొచ్చాడు. జట్టు ఎంపిక విషయంలో మ్యాచ్‌కు తగ్గట్టు పరిస్థితులను బట్టి కెప్టెన్, కోచ్ నిర్ణయాలు తీసుకుంటారే తప్ప సోషల్ మీడియా ఒత్తిడితో టీమ్‌ను ఎంపిక చేయబోమని గౌతీ నొక్కిచెప్పాడు.

తన్మయ్ సిక్సర్.. 174 రన్స్‌కే ఆస్ట్రేలియా ఆలౌట్

అహ్మదాబాద్ : సొంతగడ్డపై భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాకు చుక్కలు చూపిస్తున్నది. ఇదివరకే వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి తొలి టెస్టులోనూ నెగ్గిన జోష్‌లో ఉన్న యువ భారత్.. సోమవారం నుంచి మొదలైన రెండో అనధికారిక టెస్టులోనూ సత్తాచాటింది. యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా (6/32) ఆరు వికెట్లతో విజృంభించిన వేళ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 174 రన్స్‌కే కుప్పకూలింది. అతడికి తోడు అయాన్ ఖాన్ (2/45) సైతం రాణించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 2 వికెట్లు కోల్పోయి 38 రన్స్ చేసింది.





రెట్టింపు కామెడీతో 'హుషారు-2'

2018లో విడుదలై విజయవంతమైన 'హుషారు' చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతున్నది. సోమవారం 'హుషారు-2' సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు. రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంథోని, దినేష్‌తేజ్, శశిధర్ కోచర్లకోట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీహర్ష దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నేటి ట్రెండ్‌కు తగినట్లుగా విభిన్న కథాంశంతో ఆద్యంతం కామెడీ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు. తొలిభాగానికి మించిన రెట్టింపు వినోదంతో ఈ సీక్వెల్‌ను ఉంటుందని, షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ ఏడాది చివరలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సన్ని ఎం ఆర్, నిర్మాతలు: రాహుల్ వర్మ, కె.వీణా రాణి, కె.హనుమంత్ రాజు, రచన-దర్శకత్వం: శ్రీహర్ష కొనుగంటి

గ్రిప్పింగ్ హారర్ ఎలిమెంట్స్‌తో 418

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీమూవీమేకర్స్ నుంచి రానున్న ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ '418'. అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రంలో చైత్ర ఆచార్, సూర్యరాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ కీలకపాత్రధారులు. కీర్తన్ నాదగౌడ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం దసరా కానుకగా ఈ నెల 23న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్నది. హారర్ మిస్టరీతో ఈ సినిమా సంచలనం సృష్టించడం ఖాయమని, స్టన్నింగ్ విజువల్స్, చిల్లింగ్ పెర్‌ఫార్మెన్స్, హంటింగ్ స్కోర్, సూపర్ నేచురల్ థ్రిల్స్‌తో గ్రిప్పింగ్ హారర్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా అందివ్వబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ దివాకర్, సంగీతం: వెంకీ జీజీ, నిర్మాతలు: నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్.



భయపెట్టే పోతిరెడ్డిపల్లి

పవన్, మౌనిక, సిరి ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ 'పోతిరెడ్డిపల్లి'. అశోక్ రొయ్య దర్శకత్వంలో జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు బాబూమోహన్ క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు, కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య, దర్శకుడు వి.సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నదని హీరో పవన్ తెలిపారు. ఇరుముడి సాయిస్వరూప్, సునీత మనోహర్, ఆనంద్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: ర్యాప్ రాక్ షకీల్, సమర్పణ: త్రిపుర మీడియా, ఆరాధ్య క్రియేషన్స్.



'కాకా' మూవీ.. కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు

చిరంజీవి ప్రధాన పాత్రలో, దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న చిత్రం 'కాకా'. ఈ సినిమా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరంజీవి 'కదిరి కాళిదాస్'గా కనిపించనున్నారు. అయితే తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దర్శకుడు బాబీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.'ఓ పవర్‌ఫుల్ పాత్ర కోసం ప్రముఖ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్‌ను 'కాకా' చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో ఆయన అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారు' అని ఆయన పేర్కొన్నారు.





అప్పులన్నీ తీరిస్తే అదే ఆనందం

ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్నారు హీరో కిరణ్ అబ్బవరం. స్వీయ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'రియాలిటీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మచిలీపట్నంలో చిత్రీకరణ జరుగుతున్నది. సోమవారం టైటిల్‌ను ప్రకటిస్తూ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఇందులో హోటల్‌ను నడుపుకునే ఆనంద్ అనే వ్యక్తిగా కనిపించారు కిరణ్ అబ్బవరం. కుటుంబానికి ఉన్న అప్పులన్నీ తీర్చినరోజే తనకు నిజమైన ఆనందమని చెబుతుంటాడు. మధ్యతరగతి యువకుడి జీవితాన్ని ప్రతిబింబిస్తూ 'రియాలిటీ' టైటిల్‌కు తగినట్లుగా ఆయన పాత్ర సాగింది. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. దేవికాభట్, శరత్‌కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: కిరణ్ అబ్బవరం.

సాధారణ టికెట్ రేట్లతోనే 'రణబాలి'

అగ్ర హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నది. ఈ సినిమా టికెట్ రేట్లను పెంచబోమని, సాధారణ రేట్లకే సినిమాను ప్రదర్శించబోతున్నామని మేకర్స్ సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. ఏపీలో ఈ సినిమా ధరల్ని పెంచబోతున్నారనే వార్తల్ని చిత్రబృందం ఖండించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టికెట్ రేట్ల పెంపు కోసం ప్రభుత్వాలకు ఎలాంటి దరఖాస్తు చేయలేదని, సినిమా కంటెంట్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని మేకర్స్ ఆ ప్రకటనలో వెల్లడించారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.రవిశంకర్, ననీన్ యెర్నేని ఈ చిత్రాన్ని నిర్మించారు. 8వ తేదీన ట్రైలర్: 'రణబాలి' ట్రైలర్‌ను ఈ నెల 8న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, విజయ్-రష్మిక ఇంటర్వ్యూలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు.



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999